క్లుప్తంగా

కనీసం వేతనం అమలు చేయాలి

నందికొట్కూరు: మున్సిపాలిటిలోని ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఆ యూనియన్ నాయకులు నాగరాజు, జీవీ రాజు, వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే జయసూర్యకు మున్సిపల్ కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీసం వేతనం రూ. 21 వేలు ఇవ్వాలన్నారు. విద్యా అర్హతలను, సీనియారిటీ మేరకు విధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు శివరామ్ ప్రసాద్, వెంకటరమణ, సస్వర్‌ఖాన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మచెట్టును ఢీకొట్టిన టిప్పర్

మిడుతూరు: మండల కేంద్రం మిడుతూరు సమీపాన బ్రాహ్మణకొట్కూర్ రహదారిలో శుక్రవారం ఓ టిప్పర్ అదుపుతప్పి తుమ్మచెట్టును ఢీకొనడంతో విరిగిపడింది. భారీ టిప్పర్ నాగలూటి వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి తుమ్మ చెట్టును ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

సచివాలయాల తనిఖీ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: మండల పరిధిలోని బానుముక్కల, బానకచెర్ల, యర్రగూడూరు గ్రామాల్లోని సచివాలయాలను శనివారం ఎంపీడీఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరును పరిశీలించారు. సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ సచివలయ ఉద్యోగులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యాన పంటలకు బీమా చేయించుకోండి

పాములపాడు: ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు ప్రీమియం చెల్లించి వాతావరణ ఆధారిత బీమా చేయించుకోవాలని ఉద్యాన శాఖా అధికారిణి చందన తెలిపారు. మండల కేంద్రం పాములపాడులో శనివారం ఆమె విలేకరులతో ఆమె మాట్లాడారు. వాతావరణ మార్పుల మూలంగా పంట నష్టం జరిగితే ఆదుకునేందుకు ప్రభుత్వం బీమాను అమలు చేస్తుందన్నారు. మామిడికి ఎకరాకు రూ. 2,250 ప్రీమియం చెల్లిస్తే రూ.45వేలు, ఉల్లి - రూ.90 చెల్లిస్తే రూ.45వేలు చొప్పున పంటల బీమా వర్తిస్తుందని వివరించారు. ఈ నెల 15వతేదీ లోపు రైతులు ప్రీమియం చెల్లించాలని, అప్పుడే బీమా వర్తిస్తుందని చెప్పారు.

ఎంఎస్‌ఎంఈ సర్వేను వేగవంతం చేయండి



వీరాపురంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: గ్రామాలలో చేపట్టిన ఎంఎస్‌ఎంఈ(మైక్రో స్మాల్ మరియు మీడియం ఎంటర్‌ప్రైజస్) సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మేరి సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని గువ్వలకుంట్ల, జి.వీరాపురం, కొత్తపల్లి గ్రామాలలో జరుగుతున్న సర్వేను శనివారం ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు సంబంధించి హోటళ్ల, కిరాణం, జనరల్‌స్టోర్స్, మెడికల్, బియ్యం మిల్లులు తదితర దుకాణాల నిర్వాహకులు 288 ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకున్నారని, తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు తప్పవు

నందికొట్కూరు:నాటుసారా తయారు విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్ హెచ్చరించారు. మండల పరిధిలోని కోళ్లబావాపురం సమీపంలోని అడవిలో శని వారం 800 బెల్లం ఊటను ఎక్సైజ్ ఎస్ఐలు, పోలీసులు ధ్వంసం చేశారు.

నేడు యాదవ సంఘం సమావేశం

వెలుగోడు: నంద్యాల పద్మావతినగర్‌లోని శ్రీకష్ణ మందిరంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరగనున్న యాదవ సంఘం సమావేశాన్ని విజయవంతం చేయాలని అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకుడు రఘురాముడు యాదవ్ అన్నారు. నంద్యాల జిల్లాలో నామినేటెడ్ పదవులు పొందిన యాదవులు, సామాజిక కార్యకర్తలకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. నంద్యాల జిల్లాలోని యాదవులు హాజరుకావాలని కోరారు.

కష్టపడితే ఉజ్వల భవిష్యత్తు

- జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ
- ప్రభుత్వ పాఠశాలల్లో సందడిగా తల్లిదండ్రుల సమావేశం



మహానంది: తిమ్మాపురంలో తాడాట ప్రారంభిస్తున్న అతిథులు



శ్రీశైలం: తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ చంద్రబాబు



ఆత్మకూరు: ముగ్గులను పరిశీలిస్తున్న శ్రీశైలం నియోజకవర్గ ప్రత్యేకాధికారి సుధారాణి

మహానంది: విద్యార్థులు కష్టపడితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేకాధికారి మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని ఏపీ మోడల్‌స్కూల్‌లో శనివారం జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ రామసుబ్బయ్య, ప్రిన్సిపాల్ లక్ష్మణరావు పాల్గొన్నా రు. మహానందిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎం అంబమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐటీడీఏ పీఓ వెంకట శివప్రసాద్ హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

బండి ఆత్మకూరు: లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా కష్టపడి చదివితే విజయం సాధించవచ్చని ఎస్ఐ జగన్‌మోహన్ అన్నారు. స్థానిక మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రిన్సిపాల్ అబ్దుల్ రఫీ పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక బీసీ, ఎస్టీ గురుకుల పాఠశాల, ప్రతిభా పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెంట్రల్ లొకాలిటీ, హరిజనవాడ, వెస్టన్ కాలనీ, లేబర్ కాలనీల్లోని పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సీఐ జి.చంద్రబాబు, ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: తల్లిదండ్రులు, గురువులు చెప్పిన విధంగా నడుచుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నా రు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాలకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. అంతకముందు ఆత్మకూరు పట్టణ సీఐ రాము, కమిషనర్ రమేష్‌బాబు, ఎంఈఓ బాలాజీ నాయక్, తల్లిదండ్రులు ప్రసంగించారు.

బాగా చదువుకోవాలి

ఆత్మకూరు: చదువులో రాణించే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని శ్రీశైలం నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ సుధారాణి అన్నారు. మండలంలోని కరివేన జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. విద్యార్థుల నడవడికలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. అనంతరం పాఠశాలలో చేపట్టిన ముగ్గుల పోటీలను పరిశీలించారు. ఎంపీపీ తిరుపాలమ్మ, సర్పంచ్ మాణిక్యమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ బుజ్జన్న, వైస్ చైర్మన్ లావణ్య, హెచ్ఎం షానుల్లా పాల్గొన్నారు.

వెలుగోడు: సెల్, టీవీ దూరం చేస్తే పిల్లలు బాగుపడతారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ రావు అన్నారు. తల్లిదండ్రులు ఇళ్ల దగ్గర విద్యార్థుల పనితీరును పరిశీలించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరావు, విద్యా కమిటీ చైర్మన్ ఖాదర్ భాషాను ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎస్ఐ విష్ణు నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిడుతూరు: పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులు, పూర్వపు విద్యార్థులు భాగస్వాములు కావాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ దశరథరామయ్య, ఎస్ఐ ఓబులేసు సూచించారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయంలో నిర్వహించిన పేరెంట్ మీటింగ్‌కు వారు హాజరై ప్రసంగిచారు. విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో పురుషులకు తాడు లాగడం, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మమ్మ, సమకార సొసైటీ మాజీ అధ్యక్షుడు కాతా రమేష్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనాథ్, జెడ్పీ పాఠశాల హెచ్ఎం సాయి తిమ్మయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సలీంబాషా, కేజీబీవీ ఎస్ఓ విజయలక్ష్మీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు , ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిందద్రులు పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనను తల్లి దండ్రులు గమనించాలి

పగిద్యాల:పిల్లల ప్రవర్తనను తల్లి దండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని జెడ్పీటీసీ పుల్యాల దివ్య అన్నారు. శనివారం మండలంలో అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో పేరెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీహెచ్ఎస్, బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యాక్రమాల్లో ఆమె మాట్లాడారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతోపాటు తల్లి దండ్రులది కీలక పాత్ర అని పేర్కొన్నారు. స్కూళ్లలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తల్లి దండ్రులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు శేషన్న, మాజీ ఎంపీపీ చిన్న బిచ్చెన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఎంఈఓ ఇనాయతుల్లా, ఎస్ఐ కేశవ, వైస్ఎంపీపీ సింగారం వెంకటరమణ సూచించారు. మండలంలోని గువ్వకుంట్ల, గోకవరం, కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందాలు, పాఠశాలల పేరెంట్స్ కమీటి సభ్యులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ, ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తెలిపారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్‌డే ను నిర్వహించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించడంతోపాటు వారి ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టిసారించాలన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ నాగన్న, ప్రిన్సిపాల్ రమేష్, సత్యనారాయణ మూర్తి, ఎస్ఓ యశోద, వివిధపాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య

పాములపాడు: పిల్లల చర్యలను నిత్యం తల్లి దండ్రులు జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలని ఎస్ఐ సురేష్ బాబు అన్నారు. శనివారం మండలంలోని అన్ని పాఠశాలల్లో పేరెంట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏఎస్ఆర్‌జెడ్పీహెచ్ఎస్, ఏపీ మోడల్‌స్కూళ్లలో నిర్వహించిన కార్యక్రమాలకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కేజీబీవీలో విద్యార్థినుల యోగాసనాలు అబ్బుర పరిచాయి. కార్యక్రమాల్లో రిటైర్డు పీడీ శివలక్ష్మిరెడ్డి, మండల ప్రత్యేకాధికారి రాజు, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



మెగా పేరెంట్స్ మీటింగ్‌ను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

నందికొట్కూరు: విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల, పట్టణ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యా కమిటీలు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి దివాకర్

నందికొట్కూరు: మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని కర్నూలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, ఎఫ్ఏసీ(ఫుల్ అడిషనల్ చార్జ్) సీనియర్ సివిల్ జడ్జి మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ దివాకర్ స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని కోర్టు చాంబర్‌లో న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకునేలా ఇరు వర్గాలకు న్యాయవాదులు అవగాహన కల్పించాలన్నారు. వాది, ప్రతివాదులను కూర్చొబెట్టి మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరాముడు, కార్యదర్శి వెంకటరమణ, సీనియర్ న్యాయవాదులు సురేష్‌కుమార్, వెంకటేశ్వర్లు, మద్దయ్య, మద్దిలేటి, రహంతుల్లా బేగ్, నాగశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రావు, నాగమద్దిలేటి, రవికుమార్,రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాలిక మృతిపై విచారణ

స్థానిక ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూలి మృతి చెందిన బాలిక షేక్ అస్త మహిన్ ఘటనపై కర్నూలు జిల్లా అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, ఫుల్ అడిషనల్ చార్జ్ టూ నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి దివాకర్ శనివారం కోర్టు చాంబర్‌లో విచారణ చేపట్టారు. విద్యానగర్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను జడ్జి తనిఖీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు షేక్ సబేహను జడ్జి సమగ్ర విచారణ చేయడం జరిగింది.

ప్రొటోకాల్ పాటించకుండా ఆలయ నిర్మాణానికి భూమిపూజ

జూపాడుబంగ్లా: మండల పరిధిలోని తరిగోపుల మజారా రామసముద్రం గ్రామంలో వేంకటేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి శనివారం మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డితో భూమిపూజ (శంఖుస్థాపన) చేయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయం శిథిలం కావడంతో పునర్నిర్మించేందుకు ప్రభుత్వం రూ.36లక్షలు సీజీఎఫ్ నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఆ బాధ్యతను ముక్తాకన్‌స్ట్రక్షన్స్ దక్కించుకుంది. ముందుగా నిర్వహించే బాలాలయం కార్యక్రమ సమయంలో తహసీల్దార్, వీఆర్వో, ఎస్ఐ, పంచాయతీ కార్యదర్శి, ఆలయ కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఉండాలి. విగ్రహాన్ని పెకలించే సమయంలో ఈఓ, కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఉండడంతోపాటు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాల్సి ఉంది. అయితే తమ ఇష్టం అన్నట్లుగా మాజీ ఎమ్మెల్యే బైరెడ్డితో భూమి పూజ చేయించడాన్ని గ్రామస్తులు కొందరు తప్పుపడుతున్నారు. విషయాన్ని ఈఓ కార్తీక్ దృష్టికి తీసుకెళ్లగా తాను విజయవాడలో ఉన్నందున భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనలేదన్నారు. ఆలయ భూమిపూజ కార్యక్రమానికి ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం లేదన్నారు. ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం సమయంలో మాత్రమే ప్రొటోకాల్ పాటించాల్సి ఉంటుందని చెప్పారు.

యువతి అదృశ్యం

మిడుతూరు: మండలపరిధిలోని రోళ్లపాడు గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి అదృశ్యమైంది. తల్లి చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బయ్య శనివారం తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల మేరకు రోళ్లపాడు గ్రామానికి చెందిన రెడ్డిపోగు సంధ్యారాణి 5వ తేదీ ఉదయం నుంచి కనపడుడంలేదు. బంధువులు, స్నేహితును విచారించినా ఆచూకీ తెలియలేదు.

ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

నందికొట్కూరు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు విమర్శించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట సీపీఎం జీపు జాత కార్యక్రమం సీపీఎం నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాయన్నారు. కృష్ణ, తుంగభద్ర జలాలతో నందికొట్కూరు, పగిద్యాల, మిడుతూరు, జూపాడుబంగ్లా మండలాలకు తాగు, సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్, నాగన్న, ఆంజనేయులు, సాజిదాబి, జయరాణి, బాబు, హర్షవర్ధన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పొలం కావలికి వెళ్లి..తిరిగిరాని లోకానికి



పంట కాలువలో పడి మృతి చెందిన మాదిగ బక్కన్న

పగిద్యాల: కంది పొలం కావలికి వెళ్లి తిరిగిరాని లోకానికి వెళ్లిన ఉదంతం శనివారం పగిద్యాలలో జరిగింది. గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ మాదిగ బక్కన్న(65) అదే గ్రామానికి చెందిన బాబురెడ్డి నెలకు రూ.7వేల ప్రకారం ఒప్పందం కుదుర్చుకొని శుక్రవారం కంది పొలానికి కావలికి వెళ్లాడు. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడు రాత్రి అవుతున్న రాకపోవడంతో ఆందోళనకు గురై రాత్రంతా పొలం పరిసరాల్లో గాలించారు. అయినా అతని ఆచూకి కానరాలేదు. శనివారం మధ్యాహ్నం కర్ణం జయరామిరెడ్డి పొలం వద్ద పంట కాలువలో పడిన మృతుడిని విద్యుత్ లైన్‌మెన్ చంద్రమౌళి, మరో వ్యక్తి దావీదు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఘటనా ప్రదేశానికి వెళ్లి పంట కాలువలో పడిన మృతుడిని బయటకు తీసి ఇంటికి తరలించారు. పొలం కావలికి వెళ్లి వస్తామన్న చెప్పిన వ్యక్తి మృతుడై ఇంటికి చేరడంతో కుటుంబీకులు దుఃఖసాగరంలో మునిగారు.

పోస్టల్ బీమా చెక్కు అందజేత

జూపాడుబంగ్లా:తాటిపాడు పోస్టాఫీసులో ఇన్సూరెన్స్ చేసిన సభ్యుడు బోయ చెన్నరాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో భార్య కళావతికి శనివారం బీమా చెక్కును నందికొట్కూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేంద్ర అందజేశారు. రూ. లక్షకు ఇన్సూరెన్స్ పాలసీతీసుకున్న బోయ చెన్నరాయుడు ఈ ఏడాది సెప్టెంబర్ 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు రాఘవేంద్ర తెలిపారు. అతను చెల్లించిన ఆరు నెలల ప్రీమియం రూ.30వేలు కలిపి మృతుని భార్య కళావతికి రూ.1,31,796 బీమా చెక్కు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వంగల లక్ష్మిదేవి, బీపీఎం గోపి, ప్రాతకోట పోస్టు మాస్టర్ భాస్కర్, టీచర్ ఉస్మాన్‌బాషా, ఆర్ఎంపీ ఎర్రన్న, వెయిల్ ఓవర్‌సీస్ చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు



గాయపడిన సుంకన్న

బండిఆత్మకూరు: మండల పరిధిలోని పార్నపల్లి ప్రభాత్ కాలేజీ సమీపంలో శనివారం సాయంత్రం కారు బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. నంద్యాల నుంచి వేల్పనూరుకు వెళ్తున్న షిఫ్ట్ డిజైర్ కారు పార్నపల్లి నుంచి నంద్యాల వైపు బైక్‌పై వెళ్తున్న దుద్దుకూరి సుంకన్నను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుంకన్న కాలికి తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం నంద్యాల జనరల్ ఆస్పత్రికి తరలించారు.

బీమాతో రైతుకు ధీమా

ఆత్మకూరురూరల్: ఉద్యాన పంటలకు వాతావరణ ఆధారిత బీమా చేసుకుని ప్రీమియం చెల్లించాలని ఉద్యాన అధికారిణి చందన అన్నారు. ఆత్మకూరు డివిజన్‌లో మామిడి, ఉల్లి తదితర ఉద్యాన పంటలకు రైతులు బీమా చేయించుకోవాలన్నారు. మామిడి తోటలకు ఎకరాకు రూ.2,250 చెల్లించడం ద్వారా రూ.45,000 బీమా పొందవచ్చన్నారు. అలాగే ఉల్లి పంటకు ఎకరాకు రూ. 90 ప్రీమియం చెల్లించి రూ.45,000 పరిహారం అందుకోవచ్చన్నారు. ఈ నెల 15వ తేదీలోగా బ్యాంకు లేదా సర్వీస్ సెంటర్, మీసేవాలో చెల్లించవచ్చని తెలిపారు.

రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు

ఆత్మకూరు: నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలో శనివారం సాయంత్రం రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారంతో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ తహసీల్దార్ వెంకటనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది ఖల్లావీధిలో ఉన్న నూరుమహమ్మద్ అనే వ్యక్తి ఇంటిలో సోదాల నిర్వహించారు. ఈ సోదాల్లో అక్రమంగా నిలువ ఉంచిన క్వింటన్నర రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఇదిలా ఉండగా.. ఆత్మకూరు ప్రాంతంలో రేషన్ బియ్యం అక్రమ తరలింపు అధికంగా జరుగుతోంది. రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా టన్నుల కొద్దీ బియ్యం తరలిపోతోంది. అయితే అధికారులు భారీగా జరిగే అక్రమ వ్యాపారాన్ని వదిలిపెట్టి అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఇంట్లో క్వింటన్నర బియ్యం పట్టుకోవడం చర్చనీయాంశమైంది.

నల్లమల ఘాట్‌లో తప్పిన ప్రమాదం

మహానంది: నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో ప్రమాదం తప్పింది. శనివారం నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న అనంతపురం జిల్లాకు చెందిన వేణు, కుటుంబ సభ్యుల కారు చింతమాను మలుపు వద్ద అదుపు తప్పి కొండ చరియను ఢీకొంది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదం జరిగినట్లు సమాచారం. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ మార్గంలో వెళ్తున్న ప్రయాణికులు వారి కారును పక్కకు తప్పించి కొద్దిపాటి మరమ్మతులు చేయడంతో సురక్షితంగా వెళ్లారని ప్రయాణికులు తెలిపారు.

ఎన్‌పీసీఐ, ఎంఎస్‌ఎంఈ సర్వేలకు సహకరించండి

జూపాడుబంగ్లా: ఎన్‌పీసీఐ, హౌసింగ్ మ్యాపింగ్, ఎంఎస్‌ఎంఈ సర్వేలకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా ఎన్‌పీసీఐ బ్యాంకు లింకింగ్ సర్వే, హౌసింగ్ జియోట్యాగింగ్, సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల సర్వే కొనసాగుతుందన్నారు. మండలం వ్యాప్తంగా 12,712 ఇళ్లు ఉండగా ఇప్పటిదాకా 12,552 ఇళ్ల జియోట్యాగింగ్ పూర్తి చేసి 98.74శాతం సర్వే పూర్తిచేసినట్లు తెలిపారు.

చెడు వ్యసనాలతో జీవితం దుర్భరం



జెడ్పీ పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ ప్రసాద్‌రావు

శ్రీశైలం: విద్యార్థులు చెడు వ్యసనాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ ప్రసాద్‌రావు సూచించారు. క్షేత్ర పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాలు సేవించడం వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. గంజాయి, డ్రగ్స్, కొన్ని రకాల దగ్గు మందులు మత్తును కలగజేస్తాయన్నారు. మత్తు పదార్థాలు సేవించిన వారు తల్లిదండ్రులు, సన్నిహితుల మాటలను సైతం లెక్కచేయరన్నారు. చివరకు భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలిపారు. మత్తులో ఎన్నో అఘాయిత్యాలకు పాల్పడతారని అన్నారు. వాటికి ఎంత దూరంగా ఉంటే భవిష్యత్తు అంత బాగుంటుందని తెలిపారు. అలాంటి వ్యక్తుల గురించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సోమశేఖర్, కానిస్టేబుల్స్ మహేందర్ రెడ్డి, నాగవేణి, వెంకటనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

అన్నదానసత్రం ప్రారంభోత్సవానికి ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం గ్రామంలో మల్లేశ్వరస్వామి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన అన్నదాన సత్రం ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 11వ తేదీ అన్నదాన సత్రం ప్రారంభించనున్నారు. ఏటా శివరాత్రి, ఉగాది పర్వదినాల సందర్భంగా లక్షలాది మంది శివ భక్తులు వెంకటాపురం మీదుగా శ్రీశైలానికి కాలినడకన వెళ్తుంటారు. వారికి ఉపయోగకరంగా ఉండనుంది. వెలుగోడు ఎంపీపీ లాలంరమేష్, కుందూరు నాగేశ్వర్‌రెడ్డి, తిరుపంరెడ్డి పాల్గొన్నారు.

14న క్యాండిల్‌లైట్ సర్వీస్

ఆత్మకూరు: ఈనెల 14వ తేదీ యునైటెడ్ క్యాండిల్ లైట్ సర్వీస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు పాస్టర్స్ కలువండి త్యాగరాజు, చిలుక కృపానందం తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రపంచశాంతికి నిర్వచనం క్రిస్మస్ పండగ అని పేర్కొన్నారు. ఆత్మకూరు మార్కెట్‌యార్డులో 18వ క్యాండిల్ లైట్ సర్వీస్ కార్యక్రమం ఉంటుందన్నారు. పాస్టర్‌లు రమేష్, జయరాజ్, గద్దల ఫిలోమన్, ధనపాల్, మైకేల్‌శామ్యూల్‌నాయక్, ఏలియా బెంజిమెన్, ఆనంద్‌బాబు, సుధాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాస్టర్ త్యాగరాజు

మా వైపు కాస్త చూడండయ్యా..!



రంగులు వెలిసిన శివపార్వతుల విగ్రహాలు

మహానంది: రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో మహానంది ఒకటి. మహానందిలో కొలువైన మహానందీశ్వరస్వామికి ఏడాదికి రూ. 17కోట్లు ఆదాయం వస్తోంది. ఆలయానికి నిత్యం వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారు. భక్తులు ఆలయంలోకి ప్రవేశించే ముందే రాజగోపురం దర్శనమిస్తుంది. రాజగోపురంపై ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాలు భక్తులను ఎంతో ఆకర్షిస్తాయి. అయితే ఇటీవల రంగులు వెలిసిపోవడంతో కళ తగ్గింది. అధికారులు స్పందించి విగ్రహాలకు రంగులు వేయాల్సిన అవసరం ఉంది.